సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 1 । మే । 2024



చీనీ టన్ను రూ.36 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.36 వేలు, కనిష్టంగా రూ.14 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



ముగిసిన చౌడేశ్వరీ ఉత్సవాలు
అమడగూరులో వెలసిన చౌడేశ్వరీదేవి ఉత్సవాలు ముగిశాయి. చివరి రోజు మంగళవారం రాత్రి అమ్మవారు హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.
8లో

గరిష్టం/కనిష్టం
44.9°/ 22.8°
జిల్లావ్యాప్తంగా మంగళవారం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత కొనసాగింది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు చేయాలి

- ఎన్నికల పరిశీలకులు అన్బుకుమార్, రామచంద్ర తివారీ



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు

పుట్టపర్తి అర్బన్: ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు నిబంధలన్నీ పక్కాగా అమలు చేయాలని ఎన్నికల పరిశీలకులు అన్బుకుమార్, రామచంద్ర తివారీ సూచించారు. మంగళవారం వారు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డీఆర్‌ఓ కొండయ్యతో కలిసి ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రభుత్వ యంత్రాంగం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న బృందాలు సకాలంలో నివేదికలను సమర్పించే విధంగా చూడాలన్నారు. జిల్లాలోని పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్ల వివరాలు, ఓటరు జాబితా, భద్రతా చర్యలు, రిసెప్షన్ కేంద్రాలు, వెబ్ క్యాస్టింగ్ కోసం సిబ్బంది కేటాయింపు, పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల్లో వసతులు, ఫ్లయింగ స్క్వాడ్, మైక్రో అబ్జర్వర్లు, కంట్రోల రూం ఏర్పాటు, చెక్ పోస్టుల వివరాలు, ఓటర్ల స్లిప్పుల పంపిణీ, సమస్యాత్మక గ్రామాల వివరాలు, హోం ఓటింగ్ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. డీఆర్‌ఓ అన్ని వివరాలను తెలియజేశారు. ఓటర్లు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామని, పోలింగ్ కేంద్రాల్లో వసతులు, ఎన్నికల కోడ్ అమలు గురించి పరిశీలకులకు వివరించారు. సమావేశంలో నోడల్ ఆఫీసర్ వెంకటనారాయణ, లైజనింగ్ అధికారులు సుబ్బారావు, చంద్రశేఖర్‌రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో అప్రమత్తంగా ఉండాలి

- చెక్‌పోస్టుల్లో ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయాలి
- సిబ్బందికి ఎస్పీ మాధవరెడ్డి ఆదేశం




మడకశిర మండలం యూ.రంగాపురం చెక్ పోస్టులో వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ

మడకశిర రూరల్/గుడిబండ/రొళ్ల/అగళి: ఎన్నికల నేపథ్యంలో ఆంధ్ర- కర్ణాటక సరిహద్దులోని చెక్‌పోస్టుల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మాధవరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన మడకశిర మండల పరిధిలోని యూ.రంగాపురం చెక్‌పోస్టు, గుడిబండ మండల పరిధిలోని కర్ణాటక సరిహద్దులో ఉన్న ఇటికేపల్లి చెక్‌పోస్ట్, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, రొళ్ల మండల పరిధిలోని కె.బ్యాడిగెర గ్రామ సమీపాన సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును, రత్నగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం అగళి మండలంలోని కర్ణాటక సరిహద్దులోని పీ.బ్యాడిగెర చెక్‌పోస్ట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కర్ణాటక ప్రాంతం నుంచి నగదు, మద్యం సరఫరా కాకుండా ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేసిన తర్వాతే పంపించాలన్నారు. ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలన్నారు. తనిఖీ సమయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు జరిగే విధంగా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై సిబ్బందిని ఆరా తీశారు. ఎస్పీ వెంట పెనుకొండ డీఎస్పీ బాజీజాన్‌సైదా, సీఐలు రాజ్‌కుమార్, మనోహర్, ఎస్‌ఐలు రాజశేఖర్, మునిప్రతాప్, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

‘పల్లె’ పల్లెనా పచ్చమేత!

- టీడీపీ హయాంలో సీనియర్ నేత అవినీతి పర్వం
- ‘నీరు–చెట్టు’ పనుల్లో అంచనాలకు మించి దోపిడీ
- ఒక్క ఇసుకపైనే రూ.150 కోట్లపైగా అక్రమార్జన
- ఇంటి పట్టాల పేరుతో కొత్తచెరువులో రూ.5 కోట్లు స్వాహా
- తాజాగా జనాన్ని బురిడీ కొట్టించేందుకు కొత్త నాటకాలు
- అయ్యవారికి గుణ‘పాఠం’ చెప్పేందుకు సిద్ధమైన జనం

ఆయనో సాధారణ అధ్యాపకుడు. ఆ తర్వాత కాలంలో విద్యాసంస్థల అధినేతగా మారాడు. ఊరూరా విద్యాలయాలు నెలకొల్పి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి భారీగా దండుకున్నాడు. అప్పటికీ ధనదాహం తీరక రాజకీయ నేత అవతారం ఎత్తాడు. పచ్చమందతో కలిసి అందినకాడికి దోచుకున్నాడు. ప్రకృతి వనరులను కొల్లగొట్టి రూ.కోట్లు కూడబెట్టాడు. నియోజకవర్గ ప్రజలను నిండా ముంచి తన సామ్రాజ్యాన్ని విస్తరించుకున్నాడు. ఈ అయ్యవారి లెక్కలు తీసిన జనం గత ఎన్నికల్లో గుణపాఠం చెప్పగా..తాజాగా మరోసారి గిమ్మిక్కు రాజకీయాలతో జనం ముందుకు వస్తున్నారు.





నాడు

బండ్లపల్లి - విరుపాపురం మధ్య కంకరతేలి గుంతలమయమైన రోడ్డు



నేడు

వైఎస్సార్ సీపీ హయాంలో విరుపాపురానికి వేసిన తారురోడ్డు

కొత్తచెరువు: అమాయకమైన ముఖంతో కనిపించే అయ్యవారు.. అయ్యబాబోయ్ అనేలా అవినీతి పర్వం సాగించాడు. టీడీపీ హయాంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని మొత్తంగా మేసేశాడు. ప్రకృతి వనరులను చెరబట్టి అందినకాడికి దోచుకున్నాడు. ఇసుక అక్రమ రవాణా, ఇంటి పట్టాల పేరుతో అక్రమార్జన, నీరు– చెట్టుతో అంచనాలకు మించి దోపిడీ, ఇలా చెప్పుకుంటూపోతే ఆయన చేసిన దోపిడీ పల్లెపల్లెనా అంతా ఇంతా కాదు. తాజా ఎన్నికల్లో ‘సారు’ చేస్తున్న నటన చూసి జనం పాతవన్నీ గుర్తుచేసుకుంటున్నారు.

అరాచకశక్తులకు అండగా నిలిచి..
టీడీపీ హయాంలో గ్రామాల్లో జన్మభూమి కమిటీలు అరాచక శక్తులుగా ఉండేవి. నిరుపేదల జీవితాలతో ఆడుకునేవి. సదరు సారు డైరెక్షన్‌లోనే పుట్టపర్తిలో ఆ కమిటీ సభ్యులు రెచ్చిపోయారు. అరాచకాలు చేస్తూ నిరుపేదల జీవితాలతో ఆడుకున్నారు. అయినా తనకేం తెలియదన్నట్లు వ్యవహరించిన పచ్చనేత...వారికే వంతపాడుతూ ఊరూరా అవినీతి పర్వం కొనసాగించాడు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత మూట కట్టుకున్నారు.

మాయ‘దారి’ కథలు
2014 ఎన్నికల్లో ‘సారు’ కోతలు కోటలు దాటాయి. తనకు మద్దతు తెలిపితే నియోజకవర్గవ్యాప్తంగా తారురోడ్డు లేని గ్రామాలన్నింటికీ మిలమిల మెరిసే రోడ్లు వేయిస్తానంటూ మాయ‘దారి’ కథలు చెప్పాడు. పుట్టపర్తి మండలం జగరాజుపల్లి, కొత్తచెరువు మండలం విరుపాపురం... ఇలా నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో రోడ్లు లేని దాదాపు 90 గ్రామాల్లో తారురోడ్లు వేస్తానని హామీ ఇచ్చారు. ఆ తర్వాత రాష్ట్రస్థాయిలో పదవులు వెలగబెట్టాడు. అయినా కూడా నమ్మి ఓటేసిన జనాన్ని పట్టించుకోలేదు. సంపాదనే ధ్యేయంగా ముందుకు సాగాడు. ఫలితంగా టీడీపీ హయాంలో రోడ్లకు నోచుకోని ‘పల్లె’ జనం అల్లాడిపోయారు. దారిలేక అంబులెన్స్‌లు సైతం గ్రామాలకు రాక...సకాలంలో వైద్యం అందని పరిస్థితుల్లో ఎందరో ప్రాణాలు కోల్పోయారు. ప్రజాగ్రహాన్ని అంచనా వేసిన ‘మాస్టారు’ 2019 ఎన్నికలకు రెండురోజులు ముందు ఆయా గ్రామాలకు జేసీబీలు పంపి రోడ్లు వేయిస్తున్నట్లు నాటకానికి తెరలేపాడు. దీంతో చిర్రెత్తిపోయిన జనం ఆ ఎన్నికల్లో మంచి గుణపాఠం నేర్పి ఇంట్లో కూర్చోబెట్టారు.



2019లో జనవరిలో కొత్తచెరువులోని శివాలయం గేట్లను జేసీబీతో కూల్చిన టీడీపీ నాయకులు (ఫైల్)

పచ్చనేతలకే పట్టాలు
మాన్యం భూములపైనా మాస్టారు కన్నేశారు. నేరుగా కొట్టేస్తే జనానికి తెలిసిపోతుందని పట్టాల పేరుతో మంత్రాంగం చేశారు. కొత్తచెరువు బీసీ కాలనీలోని 14.70 ఎకరాల వేణుగోపాలస్వామి మాన్యం భూమిలో (సర్వే నంబర్లు 478,1459,1460) 562 మందికి ఇంటి పట్టాలు ఇప్పించారు. ఇందులో 200 పట్టాలు పచ్చ నాయకులకే ఇచ్చారు. మిగిలిన వాటిని ఒక్కో పట్టా రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు విక్రయించి రూ. 5 కోట్లపైనే ఆర్జించాడు. 2019 జనవరిలో కొత్తచెరువులో కొండ కింద ఉన్న శివాలయం గేట్లు సైతం తీసివేయించి రియల్ వ్యాపారానికి తెరలేపారు.

నీరు– చెట్టులో రూ.కోట్ల అవినీతి
నీరు–చెట్టు పథకం పేరుతో సదరు టీడీపీ సీనియర్ నేత రూ.కోట్లు కొల్లగొట్టాడు. నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో పనులకు అప్పటి ప్రభుత్వం రూ. 40 కోట్లు మంజూరు చేయగా, ఇందులో రూ.20 కోట్లకు పైగా అవినీతి జరిగింది. బుక్కపట్నం చెరువులో కంపచెట్లు తొలగించేందుకు రూ.3 కోట్లు మంజూరు చేయించుకున్న పచ్చనేత అందులో ఏకంగా రూ. 2 కోట్లపైనే స్వాహా చేశారు. ఇలా నిధులను దారి మళ్లించి అవినీతి సొమ్ముతో ఉమ్మడి జిలా వ్యాప్తంగా వందల ఎకరాలను సమకూర్చుకున్నారు.

గిమ్మిక్కు రాజకీయం
టీడీపీ హయాంలో చేసిన అవినీతి, అక్రమాల ఫలితంగా 2019లో సారుకు జనం బుద్ధి చెప్పారు. దీంతో తాజా ఎన్నికల్లో సదరు నేత గిమ్మిక్కు రాజకీయాలకు తెరలేపాడు. జనం తన వెంట ఉన్నారని చెప్పుకునేందుకు టీడీపీ నాయకులకే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించడం, సంచారజాతుల వారికి దినసరి కూలి ఇచ్చి పార్టీలోకి చేర్చుకున్నట్లు ఫొటోలు తీసి ప్రచారం చేసుకోవడం తదితర వాటితో పబ్లిసిటీ స్టంట్ చేస్తున్నారు.

ఓట్లు దండుకునేందుకు శవ రాజకీయం
ఏం చేసినా జనం నమ్మక పోవడంతో ఎవరు చనిపోయినా అధికార పార్టీ వారే చేశారంటూ మొసలి కన్నీరు కారుస్తూ శవరాజకీయానికి పెద్దసారు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే 2024 మార్చి 24న నల్లమాడ మండలం కుటాలపల్లిలో జరిగిన దుద్దుకుంట అమర్నాథ్‌రెడ్డి హత్యను రాజకీయంగా వాడుకుని శవ రాజకీయం చేశారు. అయితే అక్రమ సంబంధం వల్లే దుద్దుకుంట అమర్నాథ్ రెడ్డిని హత్య చేశారని ఎస్పీ మాధవరెడ్డి తేల్చారు. దీంతో పచ్చనేత నవ్వులపాలయ్యాడు. అయినా పద్ధతి మార్చుకోని ‘పెద్దసారు’ ఏప్రిల్ 27న కొత్తచెరువు మండలం బండ్లపల్లి గ్రామంలో టీడీపీ నాయకుడు అయూబ్‌ఖాన్‌ను రెచ్చగొట్టి అదే గ్రామానికి చెందిన మున్వర్‌బాషాతో ఘర్షణకు దిగేలా చూశారు. ఈ ఘటనను అనుకూలంగా మార్చుకునేందుకు సారు ఏకంగా పోలీసు స్టేషన్‌కు వెళ్లాడు. పోలీసులపై ఒత్తిడి చేసి మున్వర్‌బాషాపై కేసు నమోదు చేయించాడు...ఇలా అందరినీ భయపెట్టి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారు. కానీ జనం సారుకు బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారు.

ఇసుక దోపిడీనే రూ.150 కోట్లు

టీడీపీ హయాంలో పెద్దసారు ప్రకృతి వనరులపై కన్నేశారు. ఇసుక అక్రమ రవాణాతో అందినకాడికి దోచుకున్నారు. పుట్టపర్తి సమీపంలోని చిత్రావతి నది నుంచి బెంగళూరుకు ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నారు. ఎవరైనా అడ్డుచెప్పినా బుగ్గకారులో వెళ్లి భయపెట్టేవాడు. ఇలా నాలుగేళ్ల కాలంలో రూ.150 కోట్లపైనే ఇసుక ద్వారా ఆర్జించాడు.



చిత్రావతి నుంచి ఇసుక తవ్వుతున్న దృశ్యం (ఫైల్)

టీడీపీ మేనిఫెస్టో అబద్ధాల పుట్ట

- మంత్రి ఉషశ్రీచరణ్



పెనుకొండ: ప్రజాగళం పేరుతో టీడీపీ అధినేత చంద్రబాబు విడుదల చేసిన మేనిఫెస్టో అబద్ధాల పుట్ట అని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి, పెనుకొండ వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఉషశ్రీ చరణ్ అన్నారు. మంగళవారం రాత్రి ఆమె పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, జనసేనతో పొత్తుపెట్టుకున్న చంద్రబాబు.. ఆ పార్టీల ప్రమేయం లేకుండానే మేనిఫెస్టో ప్రకటించారని, దీన్నిబట్టి చూస్తే పొత్తుపై ఆయనకు ఎంత నమ్మకం ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. చంద్రబాబు నమ్మక ద్రోహం గురించి ప్రధాని మోదీకి ఎప్పుడో తెలుసన్నారు. ఏ ఎన్నికలు వచ్చినా చంద్రబాబు ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకుని కీలక సమయంలో ఆ పార్టీల ప్రమేయం లేకుండా మేనిఫెస్టో విడుదల చేయడం అలవాటేనన్నారు. చివరకు మేనిఫెస్టో అమలు చేయకుండా మోసం చేయడం ఆయన నైజమన్నారు. 2014లో చంద్రబాబు 600లకుపైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని, చివరకు మేనిఫెస్టోను సైతం టీడీపీ వెబ్‌సైట్ నుంచి తొలగించారన్నారు. అందువల్లే బీజేపీతో పాటు ఇతర పార్టీ నాయకులు చంద్రబాబు మేనిఫెస్టోను నమ్మడం లేదన్నారు. చంద్రబాబు విడుదల చేసిన మేనిఫెస్టోపై మోదీ బొమ్మ కూడా లేదన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. 2014లోనే సీఎం అయిన చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం వల్లే నేడు ప్రధానితో సహా ఏ బీజేపీ నాయకులు ఆయన హామీలు నమ్మడం లేదన్నారు. చంద్రబాబుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంటే గిట్టదని, కానీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అణగారిన వర్గాలకు ఎంతో సహకారం అందించారన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నకు పట్టం కట్టి సంక్షేమ పథకాలకు మద్దతు పలకాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

బాబోయ్ ఎండ

పుట్టపర్తి టౌన్: సూర్యుడు ప్రతాపం చూపగా, జిల్లా నిప్పులకొలిమిని తలపించింది. మంగళవారం కూడా కదిరిలో అత్యధికంగా 45.0 డిగ్రీలు, తలుపుల 44.6 డిగ్రీలు, పరిగి 43.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలోని మిగతా ప్రాంతాల్లోనూ 43 నుంచి 40 డిగ్రీల మధ్య గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



ఒక్క హామీ నెరవేర్చలేదు..!

- చంద్రబాబును వెక్కిరిస్తున్న శిలాఫలకాలు
- మళ్లీ అబద్ధపు హామీలతో వస్తున్న టీడీపీ అధినేత
- ‘నిన్ను నమ్మం బాబు’ అంటున్న జనం

కదిరి: టీడీపీ అధినేత చంద్రబాబు గతంలో సీఎంగా ఉన్నప్పుడు కదిరి ప్రాంతానికి చేసిన ద్రోహం అంతా ఇంతా కాదు. ఈ ప్రాంతానికి ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చిన పాపాన పోలేదు. రాష్ట్ర విభజన అనంతరం 2014లో ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత కదిరి ప్రజలకు ఎన్నో హామీలిచ్చారు. కొన్నింటికి శిలాఫలకాలు కూడా వేశారు. కానీ అమలుకు నోచుకోలేదు. ఆ శిలాఫలాకలు ఇప్పటికీ చంద్రన్నను వెక్కిరిస్తూనే ఉన్నాయి. చంద్రబాబు కదిరికి చేసిన మోసాలు, ద్రోహాలు కదిరి ప్రజలు గుర్తు చేస్తున్న వాటిలో మచ్చుకు కొన్ని..

- 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో కదిరికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలోని వేమారెడ్డి కూడలిలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ..‘కదిరి నియోజకవర్గ ప్రజలు టీడీపీ అభ్యర్థిని ఓడించారు. అయినా సరే కదిరి పట్టణ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కదిరికి రింగ్‌రోడ్ మంజూరు చేస్తున్నా’ అని చెప్పారు. కానీ అమలు చేయలేదు.
- కానీ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం 2019లో అధికారంలోకి రాగానే రింగ్‌రోడ్ తరహాలో కదిరికి రూ.234 కోట్లతో బైపాస్‌రోడ్డు మంజూరు చేసింది. ఈ పనులు కూడా దాదాపుగా పూర్తయ్యాయి. ఎన్నికల తర్వాత ఆ మిగిలిన పనులు పూర్తి చేసి దాన్ని ప్రారంభోత్సవం చేయనున్నారు.
- తలుపుల మండల పరిధిలోని దాంపల్లి వద్ద చేపట్టిన హంద్రీనీవా మెయిన్ కెనాల్ సొరంగ మార్గం పనులు నా చేత కాదంటూ చంద్రబాబు చేతులెత్తేశారు. కానీ జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పనులను తిరిగి ప్రారంభించి దిగ్విజయంగా పూర్తి చేసింది. ఇప్పుడు ఆ కాలువ ద్వారా నీరు పరవళ్లు తొక్కుతున్నాయి.
- రాయలసీమను కరువు రక్కసి నుంచి కాపాడి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలన్న ముఖ్య ఉద్దేశ్యంతో ఆనాడు వైఎస్సార్ హంద్రీనీవా ప్రాజెక్టును తెచ్చారు. ఇందులో భాగంగా కదిరి మండలంలోని చెర్లోపల్లి వద్ద రిజర్వాయర్‌ను ఏర్పాటు చేయించారు. వైఎస్ హయాంలోనే ఈ రిజర్వాయర్ పనులు 80 శాతం పూర్తయ్యాయి. ఆ మిగిలిన 20 శాతం పనులు పూర్తి చేయడానికి మరో పదేళ్లు పట్టింది. అయితే చంద్రబాబు తన స్వార్థం కోసం 2019 ఎన్నికలకు మునుపు సీఎం హోదాలోనే చెర్లోపల్లి రిజర్వాయర్ గేట్లు ఎత్తి కదిరి ప్రాంత రైతులకు అన్యాయం చేసి కృష్ణాజలాలను తన సొంత నియోజకవర్గం కుప్పానికి తరలించుకెళ్లారు.
- కదిరి ప్రాంత గిరిజనుల కోసం ‘బంజారా కమ్యూనిటీ భవనం’ నిర్మిస్తున్నామని 2014 జూలై 24న చంద్రబాబు సీఎం హోదాలో శిలాఫలకం వేశారు. కానీ ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. అయితే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బంజారాల కమ్యూనిటీ భవనం నిర్మాణం కోసం అధికారికంగా అర ఎకరం స్థలం కేటాయించి నిర్మాణం కోసం నిధులు కూడా మంజూరు చేసింది.
- కదిరి ప్రాంత పాత్రికేయుల కోసం రూ.5లక్షలతో ప్రెస్‌క్లబ్ భవనాన్ని నిర్మిస్తామని చంద్రబాబు గతంలో హామీ ఇచ్చారు. 2014 జూలై 25వ తేదీన శిలాఫలకాన్ని కూడా వేశారు. చివరకు ఆ హామీని కూడా నెరవేర్చలేక పోయారు. అప్పట్లో చంద్రబాబు వేసిన శిలాఫలకాలు ఇప్పటికీ బాబును వెక్కిరిస్తూనే ఉన్నాయి. ఇప్పుడు మళ్లీ ఓట్ల కోసం బాబు హామీలు గుప్పిస్తుంటే జనం ‘నిన్ను నమ్మం బాబు’ అని అంటున్నారు.



కదిరి ప్రెస్‌క్లబ్ నిర్మాణం కోసం శిలాఫలకం వేస్తున్న చంద్రబాబు (ఫైల్)



బంజారాల కమ్యూనిటీ భవనం కోసం చంద్రబాబు వేసిన శిలాఫలకం

బాబు మాటలు జనం నమ్మరు



చంద్రబాబు గతంలో బంజారాలకు కమ్యూనిటీ భవనం కట్టిస్తానని చెప్పి మోసం చేశాడు. మమ్మల్నే కాదు..అన్ని వర్గాలనూ మోసం చేశారు. ఆయన గతంలో కదిరికి ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. ఎన్నికల సమయంలోనే చంద్రబాబుకు ప్రజలు గుర్తుకొస్తారు. కోవిడ్ సమయంలో ప్రజలు అల్లాడిపోతుంటే ఆయన ఎక్కడ దాక్కున్నాడో తెలియదు. కానీ జగన్ ప్రభుత్వం కోవిడ్ సమయంలో చేసిన సేవలు మరువలేనివి. అలాగే బంజారాల సంక్షేమానికి తగిన చర్యలు తీసుకుంది.

–కృష్ణానాయక్, బంజారా సంఘం నాయకులు, కదిరి

బాబు అన్ని వర్గాలనూ మోసగించారు



చంద్రబాబు రైతుకు రుణమాఫీ చేస్తానని చెప్పి మోసగించాడు. డ్వాక్రా రుణాలు కూడా మాఫీ చేయలేదు. ఆయన చెప్పిన ఒక్క హామీ కూడా సక్రమంగా నెరవేర్చలేదు. అన్ని వర్గాలనూ మోసగించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. ఇప్పుడు మళ్లీ ఆచరణ సాధ్యం కానీ హామీలతో జనం ముందుకు వస్తున్నారు. ఆయన్ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. జగన్ మ్యానిఫెస్టోను జనం నమ్ముతున్నారు.

–ప్రసాద్, చెర్లోపల్లి, కదిరి మండలం

కౌంటింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం

హిందూపురం టౌన్/లేపాక్షి: కౌంటింగ్ కేంద్రాల్లో సౌకర్యాలన్నీ కల్పించాలని కలెక్టర్, హిందూపురం పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జాయింట్ కలెక్టర్, హిందూపురం అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి అభిషేక్‌కుమార్, సబ్ కలెక్టర్, పెనుకొండ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి అపూర్వభరత్‌తో కలిసి హిందూపురం మండలంలోని ‘బిట్స్’ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలోని గదులు, పరిసరాలను, లేపాక్షి మండలం నాయనిపల్లి క్రాస్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ‘బిట్స్’ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రంలో పెనుకొండ, కదిరి, మడకశిర, హిందూపురం నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్లు లెక్కింపు ఉంటుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాల ఓట్లు లెక్కింపు ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లనూ ఇప్పటికే పూర్తి చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు ప్రత్యేకంగా గదులను కేటాయించామని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అలాగే కౌంటింగ్ కేంద్రాల వద్ద పార్కింగ్, ఫుడ్ కోర్టు, తాగునీరు, విద్యుత్ సదుపాయం.. ఇలా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈవీఎంల భద్రత విషయంలోనూ ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ చిన్న పొరపాట్లకు కూడా తావివ్వకుండా విధులు నిర్వర్తించాలని సిబ్బందిని ఆదేశించారు.



బిట్స్ కౌంటింగ్ కేంద్రాల గదుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్ బాబు

ముగిసిన చౌడేశ్వరీదేవి మహోత్సవాలు



హంసవాహనంపై చౌడేశ్వరీదేవి

అమడగూరు: చౌడేశ్వరీదేవి మహోత్సవాలు మంగళవారం ముగిశాయి. అమడగూరులో గాజులపల్లికి చెందిన పలు కుటుంబీకుల ఆధ్వర్యంలో ఎనిమిది రోజులపాటు అంగరంగ వైభవంగా చౌడేశ్వరీ ఉత్సవాలు జరిగాయి. చివరి రోజు అమ్మవారు హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

మా కుటుంబాలకు కేతిరెడ్డే పెద్దదిక్కయ్యాడు

- కృతజ్ఞతలు తెలుపుకున్న చేనేత బాధిత కుటుంబాలు
- పిల్లల చదువుల బాధ్యత తానే తీసుకుంటానని కేతిరెడ్డి హామీ



ఆత్మీయ సమావేశానికి హాజరైన బాధిత చేనేత కార్మికుల కుటుంబ సభ్యులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: 'విధి ఇంటి పెద్దను దూరం చేసింది.. ఒక వైపు రుణదాతల ఒత్తిళ్లు.. మరో వైపు కుటుంబ పోషణకు ఇబ్బందులు.. ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నప్పుడు.. ఎడారిలో ఒయాసిస్సులా ఎమ్మెల్యే కేతిరెడ్డి అండగా నిలిచి ధైర్యం చెప్పాడు.. మా కోసం జోలెపట్టి యాచించి సాయం చేసి ఆదుకున్నాడు.. ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే కాగానే రూ.5 లక్షలు ప్రభుత్వం తరఫున సాయం అందించి ఇంటిపెద్దగా నిలిచాడు.. ఏం చేసి మీ రుణం తీర్చుకోగలం' అంటూ బాధిత చేనేత కుటుంబాలు కన్నీటి పర్యంతమయ్యారు. ఆపదలో ఆదుకున్న ఆపద్బాంధవులు కేతిరెడ్డి, సీఎం జగనన్న అంటూ కృతజ్ఞతలు తెలుపుకున్నారు. టీడీపీ హయాంలో అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుల కుటుంబాలతో మంగళవారం ధర్మవరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధిత చేనేత కుటుంబాలు గతాన్ని గుర్తు చేసుకుంటూ ఉద్వేగానికి లోనయ్యారు. పలువురు బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ సీఎం వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కేతిరెడ్డిలు ఇచ్చిన మాట ప్రకారం రూ.5 లక్షల సాయం అందించడంతో తమ కుటుంబాలకు భరోసా దక్కిందన్నారు. నవరత్నాల సంక్షేమ పథకాల ద్వారా కుటుంబపోషణ సులభతరమైందని వారు సంతోషం వ్యక్తం చేశారు. తమకు అండగా నిలిచిన వారిని ఎన్నటికీ మరువలేమని.. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి కృతజ్ఞత చాటుకుంటామని చెప్పారు.

చేనేతల దుస్థితి చూసి చలించిపోయా..

టీడీపీ హయాంలో పెరిగిన ముడి సరుకు ధరలు, పట్టు చీరకు మద్దతు ధర, గిట్టుబాటు కూలీ లేక ధర్మవరంలో చేనేత కార్మికులు అప్పుల బాధతో ఆత్మహత్యలకు పాల్పడ్డారని, వారిని పరామర్శించేందుకు వెళ్లినప్పుడు వారి దుస్థితి చూసి చలించిపోయానని ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. అందుకు తాను అప్పట్లో ప్రభుత్వ తీరును ఎండగడుతూ నేసేపేటలో జోలెపట్టి యాచించి భిక్షాటన ద్వారా వచ్చిన రూ.26 లక్షలను 40 కుటుంబాలకు సత్వర సాయం కింద అందించామన్నారు. అప్పట్లో ప్రతిపక్షనేతగా ఉన్న జగనన్న అధికారంలోకి వచ్చాక రూ.5లక్షల చొప్పున సాయం అందించి ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం టీడీపీ హయాంలో ఆత్మహత్య చేసుకున్న 63 మంది చేనేత కార్మికులకు రూ.5లక్షల చొప్పున సాయం అందించామన్నారు. చేనేతలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానన్నారు. బాధిత కుటుంబాల పిల్లలను చదివించే బాధ్యత తాను తీసుకుంటున్నాని చెప్పారు. కార్యక్రమంలో చేనేత నాయకులు జింకా కంబగిరి, గడ్డం శ్రీనివాసులు, నీలూరి ప్రకాష్, సిద్ధిరాజేష్, బండారు ఆదినారాయణ, శంకర యుగంధర్, కేతా లోకేష్, బైముతక రమణ, గుర్రం రాజా, గడ్డం రంగ, తరుణికంటి రమేష్, జానకి కంబగిరి, రంగప్రసాద్, లాయర్ క్రిష్ణ, కాళంగి శ్రీన, శాగా శ్రీన, తోపుదుర్తి వెంకటరాముడు, చింతా మారుతి, బాలం గోపాల్, చందమూరి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి



మృతి చెందిన ముల్లగూరి రామయ్య

బత్తలపల్లి: గంటాపురం గ్రామానికి చెందిన ముల్లగూరి రామయ్య (69) వడదెబ్బతో మృతి చెందాడు. బంధువులు తెలిపిన సమాచారం మేరకు.. రామయ్య రెండు రోజుల నుంచి ఎండ వేడిమితో తీవ్ర ఇబ్బంది పడుతున్నాడు. సోమవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో ఆర్డీటీ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. రామయ్యకు భార్య వెంకటలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బేల్దారి బలవన్మరణం

గోరంట్ల: మండల కేంద్రం గోరంట్లలో మన్సూర్‌బాషా (32) అనే బేల్దారి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఏఎస్‌ఐ ధనుంజయరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బేల్దారి మన్సూర్‌బాషా సంపాదించిన డబ్బంతా తాగుడుకే ఖర్చు చేసేవాడు. తాగుడు మానుకోవాలని, పిల్లల భవిష్యత్ ఆలోచించాలని భార్య రోజూ చెప్పేది. అయినా అతడిలో మార్పు రాకపోవడంతో సోమవారం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్తాపం చెందిన మన్సూర్‌బాషా మంగళవారం తెల్లవారుజామున ఇంటి పైకప్పునకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని తండ్రి అల్లాబకాష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం



కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్న పోలీసులు

గోరంట్ల: పాలసముద్రం సమీపంలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ సుబ్బరాయుడు మీడియాకు వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం పాలసముద్రం సమీపంలోని జాతీయరహదారిపై పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అనంతపురం రుద్రంపేటకు చెందిన బోయ మాధవ కేఏ01 ఏజీ 267 కారులో తరలిస్తున్న 20 బాక్సులు, పామిడి మండలం ఎద్దులపల్లికి చెందిన శేఖర్ ఏపీ02 సీహెచ్ ఇండికా కారులో తరలిస్తున్న మరో 20 బాక్సుల మద్యం పట్టుబడింది. మద్యం తరలిస్తున్న రెండు కార్లనూ సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. మద్యం తరలిస్తున్న బోయ మాధవను అరెస్టు చేశామన్నారు. మద్యం తరలిస్తున్న శేఖర్ పారిపోయినట్లు చెప్పారు.

క్లుప్తంగా

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి



ప్రచారంలో పాల్గొన్న చరణ్‌రెడ్డి

పెనుకొండ రూరల్: సంక్షేమ ప్రభుత్వానికే ప్రజలు పట్టం కట్టాలని మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని మునిమడుగు, అమ్మవారిపల్లి, చిన్నపరెడ్డి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే జగనన్నను మరో మారు ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, సింగిల్ విండో అధ్యక్షుడు సూర్యప్రకాశ్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు, సర్పంచ్ అశ్వర్థనారాయణ, మండల కన్వీనర్ నాగలూరు బాబు, మాజీ మండల కన్వీనర్ వెంకటరమణ, నాయకులు రామ్మోహన్‌రెడ్డి, వైశాలి జయశంకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వైస్ సర్పంచ్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: మండలంలోని మునిమడుగు పంచాయతీ చిన్నపరెడ్డిపల్లిలో వన్నూరప్ప గారి కొట్టాలకు చెందిన పది కుటుంబాలు టీడీపీని వీడి మంగళవారం మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

నేడు బహిరంగ సభ

అమడగూరు: అమడగూరులోని చౌడేశ్వరీ కల్యాణమండపం వద్ద బుధవారం ఉదయం 10 గంటలకు బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. సభకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డితో పాటుగా మరో ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

పెనుకొండ రూరల్: మండలంలోని వెంకటగిరి పాళ్యం గ్రామానికి చెందిన బొగ్గు ఆంజనేయులు (60) వడదెబ్బతో మృతి చెందాడు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు మృతి విషయం తెలుసుకున్న మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి గ్రామాన్ని సందర్శించి ఆంజనేయులు భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పుట్టపర్తిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయం



ప్రచారం నిర్వహిస్తున్న దుద్దుకుంట అపర్ణారెడ్డి

నల్లమాడ: పుట్టపర్తిలో రెండోసారి వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదిఆంధ్రపల్లి, పాతబత్తలపల్లి, కొత్తబత్తలపల్లి, తోలేటిపల్లి, పుల్లగూరపల్లిలో మంగళవారం ఆమె ప్రచారం నిర్వహించారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని, హిందూపురం ఎంపీగా బోయ శాంతమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. సర్పంచ్ మాసే రెడ్డెమ్మ, ఎంపీటీసీ రాధయ్య, మండల కన్వీనర్ కే.సూర్యనారాయణ, నాయకులు నరసింహమూర్తి, పీ. రామకృష్ణారెడ్డి, శివారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, తోలేటి మోహన్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, అంజి, కొక్కంటి శ్రీనివాసరెడ్డి, గోపాల్ రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెనుకొండలోని కొండరోడ్డు

రాయల వైభవం.. అభివృద్ధి పథం

- రాజరికపు వైభవానికి ఆలవాలం పెనుకొండ
- నేడు అభివృద్ధిలో మేటిగా ఎదుగుతున్న వైనం
- ఒకప్పుడు ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతంగా పేరు
- నాసిన్, మెడికల్ కాలేజీలతో కొత్త రూపు

పెనుకొండ: కోట కలిగిన కొండ – కొండ కలిగిన కోట అదే పెనుకొండ. రాజరికపు వైభవానికి ఆలవాలమైన పెనుకొండ విజయనగర రాజుల రెండో రాజధానిగా ఇక్కడ పరిపాలన సాగింది. క్రీ.శ. 14వ శతాబ్దం విజయనగర రాజులకు మునుపే ఇక్కడ జైనులు, పల్లవులు, చోళులు ఇతర రాజరికపు కుటుంబాలు పెనుకొండను కేంద్రంగా చేసుకుని పరిపాలన సాగించారు. విజయనగర రాజుల్లో ప్రధానంగా శ్రీకృష్ణదేవ రాయలు పెనుకొండను వేసవి విడిది కేంద్రంగా చేసుకుని తన పరిపాలనను సాగించారు. ఇక్కడ రతనాలను రాశులుగా పోసి అమ్మారని చరిత్ర చెబుతోంది. పెనుకొండలో ఇండోపార్శియన్ ఆకృతిలో నిర్మించిన గగన్‌మహల్ ఎంతో పేరుగాంచింది. పెనుకొండ కోటను చూసేందుకు నేటికీ పర్యాటకులు వస్తుంటారు. పెనుకొండలో పచ్చేపార్శ్వనాథ స్వామి దేవాలయంలో ఎంతో ప్రఖ్యాతి గాంచింది. అలాగే పట్టణంలోని బాబయ్య స్వామి దర్గాకు ఎంతో పేరుంది. ఏటా లక్షలాది మంది భక్తులు దర్గా ఉరుసు ఉత్సవాలకు రావడం పరిపాటి.

రాజకీయ నేపథ్యం

పెనుకొండ రాజకీయ నేపథ్యం ఫ్యాక్షన్ ప్రభావితంతో కూడుకుంది. 1994 నుంచి 2005 వరకూ వందల సంఖ్యలో రాజకీయ హత్యలు జరిగాయి. 1970 నుంచి 1983 వరకూ సాదరి నారాయణరెడ్డి పెనుకొండ ఎమ్మెల్యేగా పని చేశారు. 1983–84 వరకూ ఎస్.రామచంద్రారెడ్డి, 1984 నుంచి 1989 వరకూ ఎస్.రామచంద్రారెడ్డి ఎమ్మెల్యేగా పని చేశారు. 1989 నుంచి 1991 వరకూ సానే చెన్నారెడ్డి (ధర్మవరం) ఎమ్మెల్యేగా పని చేయగా, అనంతరం ఆయన నక్సలైట్ల చేతిలో హత్యకు గురికావడంతో ఆయన కుమారుడు ఎస్వీ. రమణారెడ్డి ఎన్నికల బరిలో నిలిచారు. 1994 వరకూ ఆయన ఎమ్మెల్యేగా పని చేశారు. 1994లో పరిటాల రవీంద్ర మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ అండతో నక్సలిజాన్ని వదిలి జనజీవన స్రవంతిలోకి చేరి పెనుకొండ ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందారు. అనంతరం 1999 నుంచి 2004 వరకూ పరిటాల రవి మరోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2004లో కూడా ఆయనే మరోసారి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందారు. అయితే 2005లో ఆయన హత్యకు గురికావడంతో 2005లో రవి సతీమణి పరిటాల సునీత ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. 2009 వరకూ పరిటాల సునీత పెనుకొండ ఎమ్మెల్యేగా ఉన్నారు. 2009లో కురుబ సామాజిక వర్గానికి చెందిన బీకే. పార్థసారథి పోటీ చేసి గెలుపొందారు. 2014లో మరోసారి ఎమ్మెల్యేగా బరిలో నిలచిన బీకే. పార్థసారథి 2019 వరకూ ఎమ్మెల్యేగా కొనసాగారు. 2019లో మరోసారి బరిలో నిలచిన బీకే. పార్థసారథి వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్యేగా బరిలోకి దిగిన మాలగుండ్ల శంకరనారాయణ చేతిలో 16 వేల ఓట్లతో ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం ఇక్కడ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా మాలగుండ్ల శంకరనారాయణ కొనసాగుతున్నారు.



నియోజకవర్గ ప్రత్యేకతలు

- పెనుకొండ పట్టణంలో రూ. 475 కోట్లతో మెడికల్ కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం జరుగుతోంది.
- పెనుకొండ పట్టణంలో రూ. 40 కోట్లతో ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రోడ్లను విస్తరణ చేయించారు.
- పదేళ్ల పెండింగ్‌లో ఉన్న కొండ రోడ్డును రూ. 14 కోట్లతో పూర్తి చేయించారు. కొండపై ఇస్కాన్ సంస్థ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం నిర్మించనుండగా పర్యాటకాభివృద్ధికి 100 ఎకరాలను ముఖ్యమంత్రి మంజూరు చేశారు.
- పెనుకొండ పట్టణంలో వెయ్యి ఇళ్లను జగనన్న కాలనీ నిర్మాణం చేపట్టి ఓ ఊరినే నిర్మించిన ఘనత జగనన్న ప్రభుత్వానికి దక్కింది.
- సోమందేపల్లి మండల కేంద్రంలో చేనేతలు నేసే చీరలు దేశ, విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి.
- 25 వేల హెక్టార్ల అటవీ ప్రాంతంలో అనుసంధానంగా ఉన్న ప్రాంతం పెనుకొండ.
- గొల్లపల్లి రిజర్వాయర్‌కు కేంద్ర బిందువు పెనుకొండ. ఇక్కడి నుంచి పెనుకొండ, సోమందేపల్లి, హిందూపురం, మడకశిర నుంచి చిత్తూరు జిల్లా కుప్పం వరకు తాగునీరు, సాగునీరు అందిస్తున్నారు. దీని ప్రభావం వల్ల కరువు ఛాయలు కనుమరుగయ్యాయి.
- ఐఆర్‌ఎస్‌లకు శిక్షణ ఇవ్వడానికి నాసిన్ సంస్థను పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద నిర్మించారు. ఈ సంస్థను ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు.

ఓటర్ల వివరాలు

2019లో	2,23,319 మంది ఓటర్లు ఉండగా
ప్రస్తుత నియోజకవర్గ ఓటర్లు	2,33,682
పురుషులు	1,15,159
మహిళలు	1,13,157
ఇతరులు	3

నియోజక వర్గ సమాచారం

సచివాలయాలు	83
రైతు భరోసా కేంద్రలు	65
ఆర్బీకేల్లో వెటర్నరీ కేంద్రాలు	33
వెటర్నరీ ఆస్పత్రులు	29
విలేజ్ అర్బన్/ హెల్త్ క్లినిక్‌లు	41
ఎంఎస్ఎంఇలు	29

పెనుకొండ నియోజకవర్గంలో వివిధ పథకాల కింద లబ్ధి పొందిన వారి సంఖ్య...

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి రూ. కోట్లలో
వైఎఆర్ రైతు భరోసా	44,757	281.93
సున్నావడ్డీ పంట రుణాలు	5,390	8.85
వైఎస్సార్ ఉచిత పంటల భీమా	24,276	99.29
ఇన్‌పుట్ సబ్సిడీ	1754	2.52
వైఎస్సార్ పింఛన్ కానుక	42,626	650.51
జగనన్న తోడు (రూరల్)	5,425	15.39
వైఎస్సార్ ఆసరా (రూరల్)	4,818	153.71
వైఎస్సార్ సున్నావడ్డీ	6,576	38.17
(రూరల్, ఎస్‌హెచ్‌జీ)		
వైఎస్సార్ చేయూత (రూరల్)	1,9815	131.48
వైఎస్సార్ బీమా పథకం	111	7.03
ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజ్ రుణాలు	5,169	792.66
వైఎస్సార్ సున్నావడ్డీ	178	0.19
ఎస్‌హెచ్‌జీ అర్బన్	2070	26.25
జగనన్న తోడు	218	0.21
జగనన్న అమ్మ ఒడి	25,987	147.23
జగనన్న విద్యాకానుక	25,272	9.91
వైఎస్సార్ నేతన్న నేస్తం	1230	9.97
జగనన్న వసతి దీవెన	6,692	26.15
జగనన్న విద్యాదీవెన	7,113	48.37
జగనన్న చేదోడు	1,823	6.44
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	2,598	7.40
వైఎస్సార్ కాపు నేస్తం	923	5.06
మైనార్టీ సంక్షేమం	51	3.52
వైఎస్సార్ వాహన మిత్ర	722	3.32
ధూపదీప నైవేద్యం	15	0.016
పేదలందరికీ ఇళ్ల పథకం	6,741	42.96
మొత్తం లబ్ధిదారులు	2,18,074	2,518.53

ఎన్నికల బరిలో 9 మంది

పెనుకొండ అసెంబ్లీ స్థానానికి సంబంధించి 9 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వైఎస్సార్‌సీపీ తరఫున ఉషశ్రీచరణ్, టీడీపీ అభ్యర్థిగా సవిత, బీఎస్పీ తరఫున ఆదినారాయణ, జైభీమ్‌రావు పార్టీ తరఫున నాగరాజ్, కాంగ్రెస్ పార్టీ తరఫున నరసింహులుతో పాటు నలుగురు స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు.

జనరంజకం జగనన్న మేనిఫెస్టో



పాముదుర్తి రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



పాముదుర్తి రోడ్డు షో కు హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- పాముదుర్తి రోడ్‌షోలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి
- ప్రజలను వంచించేలా చంద్రబాబు మేనిఫెస్టో
- రోడ్‌షోకు పోటెత్తిన జనం

పుట్టపర్తి: జగనన్న ఎన్నికల మేనిఫెస్టో జనరంజకంగా ఉందని, రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగేలా అన్నిఅంశాలను పొందుపర్చారని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన బుక్కపట్నం మండలం పాముదుర్తి, వెంకటాపురంలో భారీ రోడ్ షో నిర్వహించారు. రోడ్ షోకు పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. పాముదుర్తి బస్టాండ్ సెంటర్‌లో ఆయన మాట్లాడుతూ జగనన్న మేనిఫెస్టో ప్రజలు విశ్వసించేలా, చంద్రబాబు మేనిఫెస్టో ప్రజలను వంచించేలా ఉన్నాయన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన జగనన్న మళ్లీ వాటిని కొనసాగిస్తానని ప్రకటించారని, తద్వారా సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతాయన్నారు. చంద్రబాబు 2014 ఎన్నికల్లో 600లకు పైగా హామీలిచ్చి అమలు చేయలేదన్నారు. ఇప్పుడు కూడా ఆచరణ సాధ్యం కాని హామీలను గుప్పిస్తున్నారన్నారు. వలంటీర్లు ఐదేళ్ల నుంచి ప్రతినెలా 1న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందించేవారని, చంద్రబాబు తన అనుచరుల ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి ఇంటింటా పింఛన్ పంపిణీని అడ్డుకున్నారన్నారు. చంద్రబాబు నిర్వాకంతో రాష్ట్రంలోని 60 లక్షలకు పైగా లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

పుట్టపర్తి ప్రాంత అభివృద్ధికి 'పాముదుర్తి' కృషి

పుట్టపర్తి ప్రాంత అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే పాముదుర్తి రవీంద్రారెడ్డి విశేషంగా కృషి చేశారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. వైఎస్సార్ సహకారంతో మారాల రిజర్వాయర్, హంద్రీ–నీవా కాలువలు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనతోపాటు ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మను గెలిపించాలని కోరారు. నాయకురాలు బచ్చు సుజాత, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేత దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి, చిరంజీవి, లక్ష్మీనారాయణ, ఫొటోస్టూడియో శీనా, కురుబ మల్లేశ్, నాగరాజు, వెంకటాపురానికి చెందిన నరసింహారెడ్డి, సూరి, కురుబ లక్ష్మీనారాయణ, శ్రీనివాసరెడ్డి, స్నేహిత్‌రెడ్డి, కొత్తకోట కేశప్ప ,రెడ్డెప్పరెడ్డి, యర్లంపల్లి మధు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చంద్రబాబు మాయమాటలు నమ్మొద్దు



ఆర్ లోచెర్లలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఉషశ్రీచరణ్, శాంతమ్మ



కంబాలపల్లిలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి ఉషశ్రీచరణ్

- మంత్రి ఉషశ్రీచరణ్

రొద్దం: చంద్రబాబు మాయమాటలు నమ్మి మళ్లీ ప్రజలు మోసపోవద్దని, జగనన్న, చంద్రబాబు పాలనలో తేడా గుర్తించి ఓటేయాలని మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ అన్నారు. మంగళవారం ఎన్నిక ప్రచారంలో భాగంగా మండలంలోని బొక్సంపల్లి, కంబాలపల్లి, కోగిర, తురకలాపట్నం, ఆర్ లోచెర్ల, బూచెర్ల, నారనాగేపల్లి, ఎం కొత్తపల్లి, గోనిమేకులపల్లి, దొడగట్ట, చెరుకూరు, చిన్నమంతూరు, పెద్దమంతూరు, నల్లూరు పంచాయతీల్లో ప్రచారం చేపట్టారు. మంత్రి మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరిందన్నారు. చంద్రబాబు జన్మభూమి కమిటీలను పెట్టి ఆ పార్టీ నాయకులకే పథకాలు అందించారని విమర్శించారు. పొరపాటున చంద్రబాబుకు ఓటు వేస్తే సంక్షేమ పథకాలకు ముగింపు పలికినట్లే అన్నారు. చంద్రబాబు ఎన్నికల మేనిపెస్టో చూస్తే ప్రజలకు మళ్లీ మోసం చేయడానికి తయడానికి సిద్ధమయ్యారని అర్థమవుతుందన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా శాంతమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసులు, మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, నాయకులు అక్కుల ప్పయాదవ్, ఎన్ నారాయణరెడ్డి, బోయ నరసింహులు, బి.నారాయణరెడ్డి, కేపీ శ్రీనివాసులు, లక్ష్మీనారాయణరెడ్డి, జెసీఎస్ కన్వీనర్ చిలకల రవి, నయ్‌రెడ్డి, రాజారెడ్డి, సి.నారాయణరెడ్డి, మారుతీరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, ధనుంజయ్, విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో టీడీపీ నుంచి దాదాపు 150 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. బొక్సంపల్లి ఐదు కుటుంబాలు, కంబాలపల్లి 22, తురకలాపట్నం 23, నారనాగేపల్లి 12, ఎం కొత్తపల్లి 5, గోనిమేకులపల్లి 2 , చిన్న మంతూరు 12, నల్లూరు 18, బూచెర్ల 8, పెద్ద మంతూరు 25 కుటుంబాలు పార్టీలో చేరాయి.

పరిగి: పెనుకొండ నియోజకవర్గ టీడీపీ మహిళా ప్రధాన కార్యదర్శి అనురాధ మంగళవారం మంత్రి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఉషశ్రీచరణ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు ఇస్తున్న గౌరవం ముందు టీడీపీ అభ్యర్థి సవితమ్మ లెక్కలేని విధంగా ప్రవర్తించడం తనకెంతో బాధించిందని అనురాధ ఆవేదన వ్యక్తం చేశారు. మండల నాయకులు లక్ష్మీరెడ్డి, ప్రభాకర్, శివరామిరెడ్డి, రాజేష్ ఆధ్వర్యంలో ఆమె వైఎస్సార్‌సీపీలో చేరారు.



అనురాధకు పార్టీ కండువా వేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించుకుందాం



ఇంటింట ఎన్నికల ప్రచారంలో కిషన్ రెడ్డి

ఓడీచెరువు: ఫ్యాన్ గుర్తుకు ఓటేసి సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించుకుందామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తనయుడు దుద్దుకుంట కిషన్‌రెడ్డి ప్రజలను కోరారు. మంగళవారం ఆయన అల్లాపల్లి పంచాయతీలోని చాల్లావారిపల్లి, బాలప్పగారిపల్లి, గౌరాపురం, దాదిరెడ్డి పల్లిలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బోయ శాంతమ్మ, దుద్దుకుంట శ్రీధర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. దాదిరెడ్డిపల్లికి చెందిన వెంకటేశ్, కిష్టప్ప దుద్దుకుంట కిషన్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ రాజు నాయుడు, జెడ్పీటీసీ కుర్లి దామోదర్ రెడ్డి, మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షామీర్‌బాషా, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆనందరెడ్డి, బూత్ లెవెల్ మేనేజర్ గోవర్ధన్ రెడ్డి, సర్పంచు వెంకటరమణ, ఎద్దుల హనుమంతరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, నరసింహరెడ్డి, రత్నశేఖర్‌రెడ్డి, చెన్నారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, రాఘవరెడ్డి, విజయ్ రెడ్డి, సుదర్శన్, కేశప్ప, అశ్వర్థరెడ్డి, నాగభూషణ పాల్గొన్నారు.

ఇంటింటా వైఎస్సార్‌సీపీ ప్రచారం



పోతులకుంటలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కొత్తచెరువు: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగేందుకు మరోసారి జగనన్నను సీఎం చేసుకుందామని వైఎస్సార్‌సీపీ నేత, ఎమ్మెల్యే బావమరిది రాఘవరెడ్డి ప్రజలను కోరారు. మంగళవారం మండలంలోని పోతులకుంట, మరకుంటపల్లి గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బోయ శాంతమ్మ, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మండల కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, పరిశీలకులు ఆవుటాల రమణారెడ్డి, సర్పంచ్ మమత రామసుబ్బయ్య, నాయకులు యోగానందరెడ్డి, శివరామిరెడ్డి, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, అశ్వత్థరెడ్డి, వెంకటనారాయణ, సూర్యనారయణ, లోచర్ల అశోక్‌రెడ్డి, నారేపల్లి సంజీవరెడ్డి, వెంకటనారాయణ, సూర్యనారాయణ, రాంభూపాల్‌రెడ్డి, నాగేంద్ర పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కొత్తచెరువు విజయనగర్ కాలనీ, గాంధీనగర్, అన్నపూర్ణ హోటల్ వీధుల్లో మండల కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, పరిశీలకులు ఆవుటాల రమణారెడ్డి, సర్పంచ్ రాధనాగరాజు, జెడ్పీటీసీ గంగాదేవి శంకర్, ఎంపీపీ భర్త రెడెప్పరెడ్డి, నాయకులు దాల్‌మిల్ సూరి, షాన్‌షేట్, అంగడి సోమశేఖర్‌రెడ్డి, వాల్మీకి శంకర్, చిన్నపోళ్ల నాగభూషణ, అంగడిసత్తి, టౌన్ కన్వీనర్ వడ్డి భాస్కర, రఫీ, యుగంధర్ ప్రచారం చేశారు.

బుక్కపట్నంలో టీడీపీకి షాక్



వైఎస్సార్‌సీపీలో చేరిన బుక్కపట్నంవాసులతో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



పాముదుర్తిలో పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: బుక్కపట్నంలో టీడీపీకి గట్టి షాక్ తగిలింది. బలిజ కులానికి చెందిన 57 కుటుంబాలు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో మంగళవారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. పుట్టపర్తిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వీరందరికి ఎమ్మెల్యే పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన పద్మా, అనిత, మాధవి, చందు, జయశ్రీ, ముత్యాలు, జయలక్ష్మీ, ఉమాదేవి, వాణి, అలివేలమ్మ, శాంతి, నాగజ్యోతి, ఆదిలక్ష్మి, లక్ష్మి, నరసమ్మ, మణి, సి.లక్ష్మీనరసమ్మ, కె.లక్ష్మీనరసమ్మ, రమణమ్మ, మరియమ్మ, కె.పద్మా, రమాదేవి, శశికళ, రోజా, శివమ్మ, చిన్నాగమ్మ, సరోజమ్మ, రత్నమ్మ, తదితరులు పార్టీలో చేరారు. పుట్టపర్తి మండలం పైపల్లికి చెందిన లెక్కల జనార్దన్ వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. నల్లమాడ మండలం రెడ్డివారిపల్లికి చెందిన చారుపల్లి టీడీపీ మాజీ ఎంపీటీసీ వెంకటనారాయణరెడ్డి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.



శ్రీధర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన చారుపల్లి మాజీ ఎంపీటీసీ వెంకటనారాయణరెడ్డి

చుక్కలూరుపల్లి నుంచి

బుక్కపట్నం మండలం చుక్కలూరుపల్లికి చెందిన హనుమంతురెడ్డి, నాగరత్నమ్మ, లక్ష్మీదేవి, శివయ్య, వేణుగోపాల్, సుమన్ మంగళవారం పాముదుర్తిలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

జగన్‌తోనే గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం

పుట్టపర్తి టౌన్: గిరిజనుల అభివృద్ధి సంక్షేమం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో సాధ్యమని, గిరిజనుల సంపూర్ణ మద్దతు వైఎస్సార్‌సీపీకేనని గిరిజన ప్రజా సమాఖ్య (జీపీఎస్) జాతీయ ఉపాధ్యక్షుడు మల్లిఖార్జున నాయక్ పేర్కొన్నారు. మంగళవారం మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎం వైఎస్ జగన్ వేర్వేరుగా రెండు సార్లు ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేశారని తెలిపారు. ఎస్టీ కమిషన్ టీటీడీ బోర్డు మెంబర్, ఎమ్మెల్సీతో పాటు నామినేటెడ్ పోస్టులు ఇచ్చారని గుర్తు చేశారు. గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపిన వైఎస్సార్‌సీపీకి అండగా ఉండి ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేసి రెండవ సారి ఎమ్మెల్యేగా శ్రీధర్‌రెడ్డి, ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవాలని గిరిజనులకు కోరారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



పరిగిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం



గోరంట్ల: ప్రచారంలో పాల్గొన్న టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వర్థనాయక్ తదితరులు

పరిగి: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఉషశ్రీ చరణ్, బోయ శాంతమ్మ గెలుపు కోసం మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమాభివృద్ధిని వివరించి ఫ్యాన్ గుర్తుకే ఓటేయాలని కోరారు.

గోరంట్ల: మండల పరిధిలోని గిరిజన తండాల్లో గిరిజన నాయకులు టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వర్థనాయక్, జెడ్పీటీసీ సభ్యుడు పాలేజయరాంనాయక్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగపు జిల్లా కార్యదర్శి మంగళవారం ముమ్మర ప్రచారం నిర్వహించారు. వానవోలు తండా, గుంటిపల్లి తండా, ముత్తరాయుని తండాలో ఇంటింటి ప్రచారం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్‌ను గెలిపించాలని కోరారు.

సోమందేపల్లి: చంద్రబాబు ఇచ్చిన ఎన్నికల హామీలను చూసి ప్రజలు మోస పోవద్దని జెడ్పీటీసీ సభ్యుడు అశోక్ సూచించారు. మంగళవారం సోమందేపల్లిలోని సప్తగిరి కాలనీ, మారుతి నగర్, పాపిరెడ్డిపల్లి, నల్లగొండ్రాయనపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి శాంతమ్మ , ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

పెనుకొండ: మున్సిపల్ పరిధిలోని మారుతీనగర్, దర్గాపేట జీఐసీ కాలనీ, గడంగి వీధిలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ రఘునాథరెడ్డి, తోటగేరి ప్రాంతంలో కౌన్సిలర్ ఫర్జియాభాను, వైఎసార్‌సీపీ నాయకులు ఫరీద్ , దర్గాపేటలో కౌన్సిలర్ షహనాభాను, ఆమె భర్త యాసిన్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బోయ నరసింహా, గురురాజ్, నగర పంచాయితీ వైస్ చైర్మన్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.